క్లుప్తంగా

పశుగ్రాసం సాగుకు దరఖాస్తుల ఆహ్వానం

ముద్దనూరు : వందశాతం రాయితీతో పశుగ్రాసం సాగుకు అర్హులైన పాడి రైతులు దరఖాస్తు చేసుకోవాలని పశువైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా బహువార్షిక పశుగ్రాసాన్ని పెంచుకునేందుకు అవకాశం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. 10 సెంట్ల నుంచి 50 సెంట్ల భూమిలో ఈ పశు గ్రాసాన్ని పెంచుకోవచ్చని, 1 సంవత్సరానికి 10 సెంట్లలో సాగుకు రూ.6599, 20 సెంట్లకు రూ. 13,197, 30 సెంట్లకు రూ.19,795, 40 సెంట్లకు రూ.26,394, 50 సెంట్లలో సాగుకు రూ. 32,992 నిధులు పాడి రైతులకు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇతర వివరాలకు ఆయా స్థానిక రైతు సేవా కేంద్రాల్లోని పశువైద్య సహాయకుని సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

పెండ్లిమర్రి : మండలంలోని గోపరాజుపల్లెలో నూతనంగా నిర్మించిన సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ సమేత, శ్రీ రాధకృష్ణ ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు శుక్రవారం వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్‌రామాంజులరెడ్డి హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, ఎంపీపీ వరలక్ష్మి, మండల కన్వీనర్ రమణారెడ్డి, సర్పంచ్ శ్రీనువాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రేపు ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ షుగర్ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచితంగా షుగర్ పరీక్షలకు సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునే వారు పరగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568 286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల సందర్శన

పెండ్లిమర్రి : చెర్లోపల్లె గ్రామపంచాయతీలోని బైరవగుట్ట వద్ద నూతనంగా నిర్మించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శుక్రవారం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి పరిశీలించారు. జనవరి నెలలో కళాశాల ప్రారంభోత్సవం ఉంటుందని ఎమైనా పెండింగ్ ఉంటే వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు.

కల్యాణం కమనీయం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని భాకరాపురం రింగ్ రోడ్డు సమీపంలో వెలసిన శ్రీకృష్ణ ఆలయంలో శుక్రవారం రుక్మిణీ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేలపై అవగాహన



నేల స్వభావంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ శివమోహన్‌రెడ్డి

సింహాద్రిపురం : స్థానిక నిడివెల్ల కస్తూర్బా గాంధీ బాలికల కళాశాలలో శుక్రవారం ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి శివమోహన్‌రెడ్డి నేల ఆకృతి, నేల నాణ్యత, వాటి పరిరక్షణ గురించి, తీవ్ర వర్షాభావ పరిస్థితులు, అధిక వర్షం, వాటి పర్యావసానం, నేల కోత అరికట్టుట తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ఎస్‌ఓ గురుదేవి, బోధన సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

పరామర్శ

చింతకొమ్మదిన్నె : ఇరిగేషన్ శాఖ డీఈ ఖాసిం సతీమణి వీరమ్మ బుధవారం మరణించిన నేపథ్యంలో శుక్రవారం కమలాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌ఛార్జి, జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పలువురు మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కడప ఉక్కు కోసం పోరాటం

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప ఉక్కు పరిశ్రమ కోసం పోరాటం చేస్తామని, అధికార, ప్రతిపక్ష నాయకులు కలిసి రావాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమపై కేంద్రం వైఖరి దారుణంగా వుందని, పార్లమెంటులో ఆ ప్రస్తావనే తమ వద్ద లేదని చెప్పడం దారుణమన్నారు.

• ఉల్లి పంట దున్నేశారు



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బమీద దెబ్బ పడుతూనే ఉంది. తుఫాన్‌లు వరుసగా రావడంతో పంటలకు తెగుళ్లు సోకడంతో పంటలను రైతులు దున్నేస్తున్నారు. మండలంలోని పెద్దపసుపుల గ్రామానికి చెందిన దుంపా వెంకటేశ్వరరెడ్డి సాగు చేసిన చిన్న బళ్లారి ఉల్లి పంటను రోటావేటర్‌తో దున్నివేశాడు. తెగుళ్ల నివారణకు పలు ధపాలు మందులు పిచికారి చేసినా ఫలితం లేకపోవడంతోనే పంటను తొలగిస్తున్నట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికే రసాయనిక ఎరువులు, పురుగు మందులు, ఇతర ఖర్చులు కలుపుకుని దాదాపు రూ.1.20 లక్షలు ఖర్చు చేశానని, కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో పైరును దున్నేశానని రైతు వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. - పెద్దముడియం

పంటల బీమాపై అవగాహన కలిగి ఉండాలి



ఎల్లారెడ్డిపల్లెలో పంటలపై అవగాహన కల్పిస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : రబీ 2024–25లో పంటలు సాగు చేసిన రైతులు పంటల బీమాపై అవగాహన కలిగి ఉండాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎల్లారెడ్డిపల్లె రైతు సేవా కేంద్రంలో రైతులకు పంటల బీమాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు ముందగా ఈ–పంట నమోదు, ఈ–కేవైసీ చేయించు కోవాలన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పంటల బీమా ప్రీమియంను చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. బ్యాంకుల్లో రుణాలు పొందిన రైతులు రెన్యువల్ చేసుకునే సమయంలోనే ప్రీమియం నగదును జమ చేసుకుంటారని తెలిపారు. రుణాలు పొందని రైతులు కామన్ సర్వీస్ సెంటర్‌లకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుకు అడంగల్, 1బీ, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్, పంట ధృవీకరణ పత్రం సమర్పించాలని ఆమె వివరించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రాప్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

మృతుడికి నివాళులు అర్పించిన మేయర్



ఇందిరెడ్డి తిమ్మారెడ్డికి నివాళులు అర్పిస్తున్న మేయర్ సురేష్‌బాబు

వల్లూరు : మండలంలోని టీ కొత్తపల్లె గ్రామానికి చెందిన ప్రముఖ టీడీపీ నేత ఇందిరెడ్డి తిమ్మారెడ్డి శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తెల్లవారుజామున మృతి చెందారు. ఐటీఆర్‌గా ఆయన అందరికీ సుపరిచితుడు. సమాచారం అందుకున్న కడప నగర మేయర్ సురేష్‌బాబు, కమలాపురం ఎమ్మెల్యే పుత్తాకృష్ణచైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి టీ కొత్తపల్లెలోని ఆయన స్వగృహానికి వచ్చి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

డీసీసీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి



ర్యాలీ నిర్వహిస్తున్న డీసీసీ బ్యాంక్ సిబ్బంది

కమలాపురం : రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ఇలా అన్ని వర్గాల ప్రజలు డీసీసీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీ బ్యాంక్ కమలాపురం శాఖ మేనేజర్ సునీత తెలిపారు. ఏపీ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం స్థానిక డీసీసీ బ్యాంక్ సిబ్బంది ర్యాలీ నిర్వహించి వారు అందిస్తున్న సేవలను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ సునీత మాట్లాడుతూ తమ బ్యాంక్‌లో డిపాజిట్ చేసే సీనియర్ సిటిజన్లకు 666 రోజులకు 8.35 శాతం, సాధారణ ప్రజలకు 7.85 శాతం వడ్డీ ఇస్తామన్నారు. బంగారు ఆభరణాలు, స్థిరాస్తి తాకట్టుపై గ్రామీణ, పట్టణ గృహ నిర్మాణాలకు, చిరు వ్యాపారులకు వర్కింగ్ క్యాపిటల్, స్వయం సహాయక సంఘాలకు రుణాలు, ఉన్నత చదువులకు విద్యా రుణాలను కూడా అందిస్తామని ఆమె వివరించారు. అలాగే 15 ఏళ్ల లోపు పిల్లలకు పొదుపు రికరింగ్, ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. వినియోగదారులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే సదస్సులు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

చింతకొమ్మదిన్నె : మండలంలోని టి.రామచంద్రాపురం గ్రామానికి సంబంధించి నరసరామయ్యగారి పల్లె అంగన్వాడీ పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ భూములకు సంబంధించిన అన్ని రకాల సమస్యలను రెవెన్యూ సదస్సుల్లో అధికారుల దష్టికి తీసుకువచ్చి నిర్ణీత సమయంలోగా తగిన పరిష్కారం పొందవచ్చని తెలిపారు. రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్ ఇర్విన్, చింతకొమ్మదిన్నె మండల తహసీల్దార్ నాగేశ్వరరావు, మండల స్పెషల్ ఆఫీసర్ చాంద్‌బాషా పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం



పులివెందులలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మధురెడ్డి, తదితరులు

కమలాపురం : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చడానికి ప్రతి ఒక్కరూ కలసి కట్టుగా కృషి చేద్దామని న్యాయవాది బీఆర్ అంబేడ్కర్ జాతీయ సేవా పురస్కార్ అవార్డు గ్రహీత ఉదయ్‌కిరణ్, మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు జూటూరు విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక క్రాస్ రోడ్డు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ తన జ్ఞానంతో ఉన్నత విద్యను అభ్యసించడమే కాక న్యాయవాదిగా, న్యాయశాఖ మంత్రిగా ఎదగడం అభినందనీయం అన్నారు. అంబేడ్కర్ అడుగు జాడల్లో నడిచి ఆయన కలలను సాధించిన నాడే ఆయనకు నిజమైన నివాళులర్పించినట్లు అవుతుందన్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చడానికి ప్రతి ఒక్కరూ కలసి కట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాది వల్లెల కొండారెడ్డి, ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మధురెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల కోసం ఎంతో కృషి చేశారని, భారత రాజ్యాంగ నిర్మాణానికి ఎంతో శ్రమించారన్నారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, కౌన్సిలర్లు, దళిత సంఘాల నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జెఎన్‌టీయూ కళాశాలలో..

స్థానిక జెఎన్‌టీయూ కళాశాలలో మహా పరినిర్వాణ్ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ శేషమహేశ్వరమ్మలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు భారత దేశానికి అంబేడ్కర్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : సామాజిక, లౌకిక, ప్రజాస్వామ్య భావాలను కలిగిన దార్శనికుడు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ అని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిబుల్ ఐటీ డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా కొనియాడారు. శుక్రవారం అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. ప్రతి విద్యార్థి ఆయనను స్ఫూర్తిగా తీసుకుని అడుగుజాడల్లో నడవాలని కోరారు. పరిపాలన అధికారి రవికుమార్, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ రత్నకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండల పరిధి రింగురోడ్‌లోని అంబేడ్కర్ సర్కిల్‌లో విగ్రహానికి కమలాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ సభ్యుడు నరేన్ రామాంజులరెడ్డి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాలకు అంబేడ్కర్ చేసిన సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : ఆర్టీపీపీలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాలర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీపీపీ సీఈ గౌరీపతి, ఏపీ జెన్‌కో అధ్యక్షుడు ఎస్. సిద్దయ్య, ఎస్‌పీఎఫ్ కమాండెంట్ కృష్ణయ్య, ఆర్ఐ రమేష్, సీఐ నారాయణయాదవ్, ఆర్టీపీపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఓబులేసు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గిరిధర్‌రెడ్డి, రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య, తదితరులు పాల్గొన్నారు.అలాగే దళిత, బీసీ సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు.



కమలాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు



వేంపల్లె : అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా



సీకేదిన్నెలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నరేన్ రామాంజులరెడ్డి

జూదరుల అరెస్టు

లింగాల : వెలిదండ్ల గ్రామ సమీపంలోని పొలాల్లో శుక్రవారం 9 మంది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.34,400 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు.

నేడు పేరెంట్స్, టీచర్స్ సమావేశం

ముద్దనూరు : నేడు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ముకుందరెడ్డి తెలిపారు. విద్యార్థులు, తల్లితండ్రులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు అయప్పస్వామి దీపోత్సవం

వీరపునాయునిపల్లె : మండలంలోని ఇందుకూరు, కొత్తపల్లె గ్రామాల్లో శనివారం శ్రీ ధర్మ శాస్త అయప్పస్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో దీపోత్సవం నిర్వహించనున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. అన్నదాన కార్యక్రమం, మధ్యాహ్నం 3 గంటలకు దీపోత్సవం ప్రారంభమవుతుందన్నారు. కోలాటం, చెక్కభజన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

వారసత్వ సంపదను కాపాడండి

కడప కల్చరల్: పూర్వీకులు ఎంతో శ్రమంతో దేవాలయాలను తీర్చిదిద్దారని, అవగాహనా లోపంతో వాటిని పాడు చేయవద్దని చారిత్రక పరిశోధకుడు చదలవాడ వెంకటేశ్ విజ్ఞప్తి చేశారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇటీవల పరిశోధనలలో భాగంగా ప్రాచీన దేవాలయాలను సందర్శించానని తెలిపారు. శిల్పాలకు దట్టంగా సున్నం కొట్టడంతో పాడైపోతున్నాయని తెలిపారు. సున్నంలోని కెమికల్స్‌తో రాతి శిల్పాలు అరిగి అసలు రూపాన్ని కోల్పోతాయన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



సమస్యలను రిటైర్డ్ జడ్జికి వివరిస్తున్న బాధితుడు

జమ్మలమడుగు రూరల్ : విద్యుత్ వినియోగదారుల సమస్యలపై అధికారులు దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని రిటైర్డ్ జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని తాడిపత్రి రహదారిలో ఉన్న సబ్‌స్టేషన్ ఆవరణలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని ట్రాన్స్‌కో డీఈ రాజగోపాల్ అధ్వర్యంలో నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు ఏమైన ఉంటే ఇటువంటి వేదికలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వినియోగదారుల నుంచి 12 సమస్యలు రాగా అక్కడికక్కడే 5 సమస్యలను అధికారులు పరిష్కారించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల బీమాకు దరఖాస్తు చేసుకోండి



రైతులకు క్రాప్ సోన్ సర్టిఫికెట్‌ను అందిస్తున్న ఏఓ రమేష్

లింగాల : ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని పొందేందుకు రైతులు ప్రీమియం చెల్లించుకోవాలని మండల వ్యవసాయధికారి రమేష్ రైతులను కోరారు. శుక్రవారం మండలంలోని కోమన్నూతల, మురారిచింతల గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అందిస్తున్న క్రాప్ సోన్ సర్టిఫికెట్లను పరిశీలించి రైతులకు అందించారు. బ్యాంకుల్లో రైతులు రుణం రెన్యువల్ ద్వారా చేసుకోవచ్చునన్నారు, బ్యాంకు రుణం లేని రైతులు కామన్ సర్వీసు సెంటర్ ద్వారా గానీ, రైతులు స్వయంగా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పోర్టల్లో నమోదు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం సందర్శన



అధికారులతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని శుక్రవారం మండల స్పెషలాఫీసర్ వెంకటేశ్వరరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మండల లెవెల్ ఆఫీసర్లతో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ గురించి మార్గదర్శకాలపై చర్చించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఫ్లోరెన్స్, ఏపీఓ గంగరాజు, ఎంఈఓ రామకృష్ణయ్య, ఏపీఎం రామాంజనేయులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



జమ్మలమడుగు : సమస్యలను ఆర్డీఓకు విన్నవిస్తున్న రైతులు



తొండూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ రామచంద్రుడు

జమ్మలమడుగు రూరల్ : గ్రామాల్లో ఉన్న భూసమస్యలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ అదిమూలం సాయిశ్రీ తెలిపారు. శుక్రవారం వేమగుంటపల్లెలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. మండలాల్లోని అన్ని పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని ఏమైన సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కారించుకోవాలని ఆమె సూచించారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకాల్లో ఉన్న తప్పులు ఇంక ఏమైన మార్పులు చేర్పులు ఉంటే చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిపూటీ తహసీల్దార్ నరేంద్రనాథ్, సర్వేయర్ గురుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తొండూరులో..

తొండూరు : రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రామచంద్రుడు తెలిపారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో రెవెన్యూ సదస్సును తహసీల్దార్ ప్రారంభించి రికార్డులను పరిశీలించారు. పంచాయతీల్లో రెవెన్యూ సదసును జరుపడం వల్ల ప్రజలు, రైతులు వారికి సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు మంచి అవకాశమన్నారు. ప్రజల వద్ద నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా సిబ్బంది ప్రయత్నించాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణారెడ్డి, రీసర్వే డిటీ రాజేశ్వరి మండల సర్వేయర్ రాఘవేంద్ర, వీఆర్ఓ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో నెలకొన్న భూసమస్యల పరిష్కారం కొసంమే రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిదని తహసీల్దార్ అనురాధ తెలిపారు. శుక్రవారం మండలంలోని తిప్పిరెడ్డిపల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఏమైనా సమస్యలు ఉంటే అర్జీలు ఇస్తే వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నరసింహులు, ఆర్ఐ శ్రీనువాసులు, వీఆర్వోలు, ప్రజలు పాల్గొన్నారు.

వేములలో..

వేముల : గ్రామీణ ప్రాంతాలలో భూముల సమస్యలను పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఇందిరారాణి తెలిపారు. శుక్రవారం మండలంలోని పెర్నపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ తగాదాలు పొలాల గట్ల మధ్య వస్తున్నాయని, వీటిని రెవెన్యూ సదస్సులలో రైతుల నుంచి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, రైతులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండలంలోని అగ్రహారం గ్రామంలో రెవెన్యూ సదస్సును తహసీల్దార్ నాగేశ్వరరావు ప్రారంభించి రికార్డులను పరిశీలించారు. ప్రజల వద్ద నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా సిబ్బంది ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో నిరంజన్, సర్వేర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : దొండ్లవాగు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో తహసీల్దార్ ఈశ్వరయ్య, మండల స్పెషలాఫీసర్ వెంకటేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. రైతుల నుంచి నాలుగు అర్జీలు మాత్రమే అందాయని, ఒక అర్జీకి సంబంధించి సమస్యను అక్కడికక్కడే పరిష్కరించామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరులో..

వల్లూరు (చెన్నూరు) : మండలంలోని కనపర్తి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తాహసీల్దార్ సరస్వతి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వానికి అందుతున్న వినతులలో ఎక్కువ శాతం భూ సమస్యలకు సంబంధించిన వినతలే అందుతున్నాయన్నారు. తమ దష్టికి వచ్చిన భూ సమస్యలను 45 రోజుల లోగా పరిష్కరిస్తామన్నారు. ఆయా సమస్యలపై అభ్యంతరాలు ఉన్నట్లయితే ఇదే సదస్సులో వినతి పత్రాలు అందజేయవచ్చునన్నారు

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని ఆందుకూరు గ్రామంలో తహసీల్దార్ లక్ష్మిదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున హాజరై మాట్లాడారు. ఇందుకూరు రెవెన్యూకు సంబంధించి మొత్తం 8 అర్జీలు అందాయని వాటిలో రెండు తక్షణమే పరిష్కరించామన్నారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన ఆర్జేడీ



విద్యార్థుల వివరాలు చూస్తున్న ఆర్‌జేడీ శామ్యూల్

కడప ఎడ్యుకేషన్: కడప వర్కర్స్ కాలనీలోని నగర పాలక ప్రాథమిక పాఠశాలను పాఠశాల విద్య ఆర్‌జేడీ కె.శామ్యూల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం అందించిన హోలీస్టిక్ ప్రోగ్రెస్ కార్డును 7న జరిగే మెగా పేరెంట్స్ కమిటీ కార్యక్రమంలో అందజేయాలన్నారు. పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచుకోవడం తోపాటు, పచ్చదనం పెంచాలని సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం ఇవ్వాలని, రాగి జావ, చిక్కి, గుడ్డు అందే విధంగా చూడాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.